జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
గురువారం | 4 | జూన్ | 2026 ◆ పేజీలు : 4



# వ్యవసాయం, సాగునీటి నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో పని చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్
- ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి
- పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించాలి
- సాగునీటి లభ్యతపై రైతులకు ముందస్తు సమాచారం అందించాలి



- వ్యవసాయం, హార్టికల్చర్, ఇరిగేషన్ శాఖలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** జిల్లాలో వ్యవసాయం, సాగునీటి నిర్వహణకు సంబంధించి

మిగతా 2 లో...




# వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

- ఆయిల్ పామ్, ఉద్యాన పంటలే రైతుల భవిష్యత్‌కు భరోసా
- ప్రత్యామ్నాయ పంటల సాగు, నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- పంట అవశేషాలకు నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవు
- ఖరీఫ్ సాగు ప్రణాళికపై మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల

## రాష్ట్ర వ్యవసాయ, సహకార,మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం తో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార,మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్,మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు.జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్టె విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు.తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు.రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశం లోని అనేక రాష్ట్రాలు మొక్క జొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి

మిగతా 2 లో...

# పిల్లల్లో అసాధారణ ప్రతిభ ఉంటుందనడానికి అర్ఫాజ్ అలీ యే నిదర్శనం

- సత్తుపల్లి లో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎంవీఎస్ కాశ్యప్
- ఖమ్మం శ్రేయాస్ వన్ సిటీ ఆధ్వర్యంలో జరిగిన సెమినార్ లో పాలిసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ కు సత్కారం, అభినందనలు
- బిగ్ బాస్ ఫేం నటి దివి వాద్వా హాజరు



**సత్తుపల్లి జూన్ 03 (ప్రజాజ్యోతి)** విద్యార్థులకు అసాధారణ ప్రతిభ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనెల 13వ తేదీ నిర్వహించిన పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షలో తెలంగాణ రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిన, మహ్మద్ మహబూబ్ అర్ఫాజ్ అలీ యే నిదర్శనం అని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మోటివేటర్

మిగతా 2 లో...

# సమాజ శ్రేయస్సు కోసం సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఏస్
- కల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవజాత శిశువుల సంరక్షణకు ఆధునిక పరికరాల ఏర్పాటు
- పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయి
- ఆసుపత్రి అభివృద్ధికి మరింత సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన కల్లా ఫౌండేషన్‌కు అభినందనలు



**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** సమాజ శ్రేయస్సు కోసం సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఏస్ ప్రశంసించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ)లో ఏర్పాటు చేసిన 9 లక్షల

మిగతా 2 లో...

## పిల్లల్లో అసాధారణ ప్రతిభ ఉంటుందనడానికి అర్ఫాజ్ అలీ యే నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి...)

ఎంవీఎస్ కాశ్యప్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన అర్ఫాజ్ అలీ ని ఘనంగా సత్కరించి అభినందించారు.ఖమ్మం శ్రేయాస్ వన్ సిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలోని యంఆర్ గార్డెన్స్ లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సెమినార్ లో ఎంవీఎస్ కాశ్యప్ ముఖ్య అతిథిగా హాజరై వ్యాపారాభివృద్ధి,నాయకత్వ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం,భవిష్యత్తు అవకాశాల పై ఉదాహరణలతో అవగాహన కల్పించారు.మొట్టమొదటిసారి సత్తుపల్లి పట్టణంలో జరిగిన మోటివేషన్ ప్రోగ్రాంలో కాశ్యప్ ప్రసంగించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. బిగ్ బాస్ ఫేం నటి దివి వాద్యా సభికులను ఉద్దేశించి ప్రసంగించారు.విజయసాధనకు బలమైన నిర్ణయాలు, కష్టపడే తత్వం గురించి శ్రేయస్ సిటీ వ్యవస్థాపకులు గంధ్ర శ్రీనివాస్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మువ్వా అశోక్ బాబు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సు కోసం సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయం



(మొదటి పేజీ తరువాయి...)

విలువైన వివిధ ఆధునిక వైద్య పరికరాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ తన కుటుంబ పరిధిని దాటి సమాజ శ్రేయస్సు కోసం సేవా దృక్పథంతో ముందుకు వచ్చే సంస్థ లు, వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ప్రజలకు ఉపయోగ పడే విధంగా ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాలను అందించడం అభినందనీయమైన కార్యక్రమమని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌళిక సదుపాయాల అభివృద్ధికి, వైద్య సేవల విస్తరణకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని కలెక్టర్ తెలిపారు. సమాజంలో అవసరమైన రంగాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మరింత మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ప్రత్యేక నవజాత శిశుసంరక్షణ కేంద్రానికి అందించిన ఆధునిక పరికరాలు అనేక మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన చిన్నారుల చికిత్సకు ఉపయోగపడతాయని చెప్పారు.నవజాత శిశువులకు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ పరికరాలు ఎంతో దోహదపడతాయని,ఆసుపత్రిలో చికిత్స నాణ్యత మరింత మెరుగుపడుతుందని తెలిపారు.కల్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకారం కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.ఎం.నరేందర్, కల్లా ఫౌండేషన్ చైర్మన్ పాపారావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ వల్లభనేని రామారావు,ప్రతినిధులు పసుమర్తి రంగా రావు, సాంబశివ రావు,మేళ్ళచెరువు వెంకటేశ్వర్లు,ఆసుపత్రి అధికారులు,వైద్యులు,సిబ్బంది తదితరులు, తదితరులు పాల్గొన్నారు.

## మడిచర్ల కుటుంబాన్ని పరామర్శించిన దాసరి దంపతులు



**సత్తుపల్లి జూన్ 03 (ప్రజాజ్యోతి)** మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల రజక సంఘం సభ్యులు మడిచర్ల వీరస్వామి గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందినారు. వారి మరణ వార్త తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాసరి వెంకటరామిరెడ్డి (చిట్టి నాయన) దంపతులతో కలిసి, మృతి చెందిన మడిచర్ల కుటుంబం ఇంటికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని ధైర్యంగా ఉండాలని, మీకు అండగా మేము ఉంటామని అధైర్య పడవద్దు అని పలు సూచనలు, సలహాలు అందించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు, మధుబాబు యూత్ సభ్యులు ఉన్నారు.

# వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు,సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత,బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్-అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు.కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం,పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశం ఇప్పటికీ వంటనూనెలు, పప్పుధాన్యాలు, కూరగాయల కోసం విదేశాలపై ఆధార పడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పా రు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వెల్లడించారు.ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు.పురుగుమందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా మాత్రమే ప్రపంచ మార్కెట్లలో పోటీ పడగలమన్నారు. రైతులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఖమ్మం జిల్లా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు.జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పక్కనే ఉన్న పంటలు, తోటలకు నష్టం వాటిల్లడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించిందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి,మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య,డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్,సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు, మీడియా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## మధిరలో ఘనంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు



**మధిర, ప్రజాజ్యోతి** మాజీ రాష్ట్ర మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు పుట్టిన రోజు సందర్భంగా మధిర లో బీ.ఆర్.యస్ పార్టీ ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. మధిర పట్టణం లోని 100 పడకల ఆసుపత్రి వద్ద జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు గారు పార్టీ నాయకులతో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు పండ్లు, మజ్జిగ ప్యాకెట్ అందించారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు గారు మాట్లాడుతూ కేసీఆర్ గారి పాలనలో మధిర ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు 100 పడకల ఆసుపత్రి కోసం 34 కోట్ల రూపాయలను ఆనాడు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్ రావు గారు మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు అలానే ఆసుపత్రి నిర్మాణం కూడా శరవేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. హరీష్ రావు గారు ఆరోగ్య, అర్థిక శాఖల్లో తనదైన ముద్ర వేసారని రాష్ట్ర స్థితిగతుల పై పూర్తి అవగాహన ఉన్న గొప్ప నాయకుడు హరీష్‌రావు అన్నారు. కార్యక్రమం లో మధిర సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్, నాయకులు పల్లపోతు వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు, అరిగే శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, తాళ్లూరి హరీష్ బాబు, అబ్బూరి రామన్, ఇక్బాల్, వంకాయలపాటి నాగేశ్వరరావు, భువనగిరి నారాయణ రావు, ఆళ్ల నాగబాబు, గద్దల స్వామి, సత్యనారాయణ రెడ్డి, చిదిరాల రాంబాబు, శ్రీను, దిల్ కుమార్, కాకుమాను కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు

## వ్యవసాయం, సాగునీటి నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రణాళికతో పని చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం ఇరిగేషన్, హార్టికల్చర్, వ్యవసాయ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నానో యూరియా ప్లస్ వినియోగంపై రైతుల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.వరి కోతల అనంతరం పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పంట అవశేషాలను కాల్చినట్లయితే జరిమానాలు విధించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పొలాల్లో మంటలు పెట్టడం వల్ల అవి అదుపు తప్పి చెట్లు, పక్కనే ఉన్న పంటలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తదితర ఆస్తులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని స్పష్టం చేశారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులను పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్,కూరగాయలు, తదితర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు పంట మార్పిడి విధానం, యూరియా వినియోగాన్ని తగ్గించే పద్ధతులపై క్రమం తప్పకుండా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.గ్రామాల వారీగా బోర్‌వెల్ ఆధారంగా సాగు చేసే రైతులు, కాలువలపై ఆధారపడి, బోర్ల ద్వారా సాగు చేసే రైతులు, చివరి ఆయకట్టు రైతులను ముందుగానే గుర్తించాలని సూచించారు.తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో వీరు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.వర్షాభావ పరిస్థితుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాశం ఉన్నందున బోర్‌వెల్ ఆధారంగా వరి సాగు చేయడం రైతులకు లాభసాటిగా ఉండదని పేర్కొన్నారు.చివరి ఆయకట్టు ప్రాంతాల రైతులను ప్రత్యేకంగా మ్యాపింగ్ చేసి స్థానిక సర్పంచ్ లు,ప్రజాప్రతినిధులు, ఇతర శాఖల భాగస్వామ్యంతో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.అనంతరం సాగునీటి సరఫరా, తదితర అంశాలపై ఇరిగేషన్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సాగునీటి లభ్యతపై రైతులకు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో వ్యవసాయ, హార్టికల్చర్,ఇరిగేషన్,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అప్పు కోసం విద్యుత్ సంస్థల తాకట్టుకుయత్నం

- మొక్కజొన్న డబ్బులు రైతులకు జమ చేయాలి.
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు.



**కారేపల్లి, జూన్ 3, ప్రజా జ్యోతి :** విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలను తాకట్టు పెట్టి అప్పుతీసుకోవటానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. సింగరేణి మండలం ఎర్రబోడులో బుధవారం రైతు సంఘం సమావేశం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రయివేటికరించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లును తీసుకరావటానికి చేసిన ప్రయతాన్ని దేశ వ్యాప్తంగా రైతాంగం గట్టిగా ప్రతిఘటించి తిప్పికొట్టిందన్నారు. ఆ బిల్లును సవరణ పేరుతో తిరిగి రాష్ట్రాలపై రుద్దే ప్రక్రియను మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. దానికి ప్రతిఫలంగా రాష్ట్రానికి రూ.10వేల కోట్లు ఇవ్వటానికి కేంద్రం సముఖతగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎత్తుగడలను రాష్ట్ర ప్రభుత్వం తలోగ్గి నడుచుకుంటుందన్నారు. రాష్ట్రంలో నార్తరన్, సౌతరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఉండగా రైతుల కోసమంటూ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పేరుతో కొత్తగా మరో డిస్ట్రిబ్యూషన్ సంస్థలను ఏర్పాటుకు ప్రభుత్వం సిద్దమవుతుందన్నారు. రైతుకు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వటం కోసమే రైతు పవర్ పంపిణి సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్రం చెప్పుతున్నా దానిలో యదార్ధం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న నార్తరన్, సౌతరన్ కంపెనీల నుండి రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పేరుతో రైతుల విద్యుత్ కనెక్షన్లను వేరుచేయటం ద్వారా నార్తరన్, సౌతరన్ కంపెనీలకు లాభాలు చూపి వాటిని తాకట్టుపెట్టి అప్పుతీసుకోవటానికి రాష్ట్రం ఎత్తుగడలేస్తుందన్నారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు రంగం సిద్దమైందన్నారు. రాష్ట్రానికి ప్రతి స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు కేంద్రం రూ.1400 ఇవ్వనుందన్నారు. స్మార్ట్‌మీటర్లు ఇండ్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద కూడా ఏర్పాటుచేయనున్నారని తెలిపారు. ప్రయివేటికరణలో భాగంలోనే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు ప్రయత్నిస్తుందన్నారు. రైతులు పండించిన మొక్కజోన్న అమ్మకానికి అష్టకష్టాలు పడ్డారన్నారు. బస్తాలు, లారీలు, గోడౌన్ల కొరత, అకాల వర్షాలతో రైతులు నానా యాతన పడి ప్రభుత్వానికి మొక్కజోన్న అమ్మినారని వాటి పైకాన్ని వెంటనే రైతు ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడకుండా పంట డబ్బులు జమతో పాటు రైతు భరోసా విడుదల చేయాలన్నారు. రైతు సమస్యలపై జరిపే పోరాటాలకు రైతులు కదిలిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు తుమ్మోజు రాంమూర్తి ,పాపినేని నాగేశ్వరరావు, భాగం వెంకటప్పారావు, ఎస్‌కే.సైదులు, తమ్మినేని ముత్తయ్య, వల్లభినేని మురళి, పాసిన్ని నాగేశ్వరరావు, అన్నారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన



**కారేపల్లి, జూన్ 3, ప్రజా జ్యోతి:** నేడు గురువారం సింగరేణి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పాల్గొన నున్నారని మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం పది గంటలకు సింగరేణి మండలం గుట్ట కింద గుంపు గ్రామంలో 15000 మెట్రిక్ టన్నులు గోదాముల నిర్మాణానికి శంకుస్థాపన, అనంతరం20లక్షల సీసీ రోడ్ల శంకుస్థాపన, కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడును. పొలంపల్లి –కోటి లింగాల బిటి రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని వారు తెలిపారు. సింగరేణి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ శాఖా అధ్యక్షులు ,నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు అన్నారు.

## కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న నాయకులకే జిల్లా మైనార్టీ పదవి ఇవ్వాలి

- సిటీ మైనారిటీ అధ్యక్షులు ఎస్కే అబ్బాస్ బేగ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా మైనార్టీ అధ్యక్ష పదవిని గత పది, పదిహేను సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, నిరంతరం శ్రమిస్తున్న సీనియర్ నాయకులకే కేటాయించాలని సిటీ మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్కే అబ్బాస్ బేగ్ డిమాండ్ చేశారు.పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా అధైర్యపడకుండా కాంగ్రెస్ జెండా ను తమ భుజస్కందాలపై వేసుకుని నడిపించిన నాయకులకి బాధ్యతలు అప్పగించాలని ఆయన కోరారు.గత ప్రభుత్వాల హయాంలో అక్రమ కేసులు బనాయించినా భయపడకుండా,పార్టీ గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పోరాడిన నిజమైన కార్యకర్తలను,నాయకులను అధిష్టానం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.కేవలం అధికారం కోసం, పదవుల ఆరాటంతో ఇటీవలే బిఆర్ఎస్ పార్టీ నుండి వలస వచ్చిన నాయకులకు జిల్లా మైనార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టవద్దని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఇచ్చిన పదవులు కూడా టిఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన నాయకులకే పదవులు అంటగట్టారు. దీనిని దృష్టిలో ఉంచుకొని నాడు అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్‌ను కాపాడుకున్న సీనియర్లను కాదని,వలస నాయకులకు ప్రాధాన్యత ఇస్తే పార్టీ కోసం రక్తం చిందించిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు.కాబట్టి,హైకమాండ్ ఇకనైనా పునరాలోచించి,పార్టీని నమ్ముకున్న విశ్వసనీయమైన,సీనియర్ మైనార్టీ నాయకుడికే జిల్లా అధ్యక్ష పగ్గాలు అప్పగించాలని అబ్బాస్ బేగ్ విజ్ఞప్తి చేశారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని హామాలి కూలి మృతి

- హమాలీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ఘటన
- ఢీకొట్టిన రెండు ద్విచక్ర వాహనాలు పరారు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పొదిలి వెంకన్న




**బోనకల్, జూన్ 3 (ప్రజా జ్యోతి):** ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘట మండల కేంద్రంలో బుధవారం వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారీ పై సాగర్ కాలువ సమీపంలో ఉదయం 7:30 గంటల సమయంలో చోటుచేసుకుంది. హమాలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతూ ఈ ఘటన జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన బోనకల్ గ్రామానికి చెందిన తోటపల్లి వెంకటేశ్వర్లు (65) ప్రతిరోజు లాగే బుధవారం కూడా బోనకల్ సాగర్ కాలువ సమీపంలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో హమాలీ పనులకు వెళ్లాడు. పనులు అనంతరం తిరిగి తన టీవీఎస్ ద్విచక్ర వాహనం పై ఇంటికి బయలుదేరాడు. వైరా – జగ్గయ్యపేట ప్రధాన రహదారిలోనే సాగర్ కాలువ సమీపంలోనే రెస్టారెంట్ వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రం నుంచి రోడ్డు ఎక్కే ప్రయత్నం చేస్తుండగా అదే సమయంలో బోనకల్ వైపు నుంచి కారు వస్తూ కారు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అదే సమయంలో ఎదురుగా రెండు మోటార్ సైకిల్ వస్తుండగా ముందుగా స్కూటీ తోటపల్లి వెంకటేశ్వర్లు టీవీఎస్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో తోటపల్లి వెంకటేశ్వర్లు కింద పడిపోగా ఆ వెంటనే వెనుక వస్తున్న మరో ద్విచక్ర వాహనం రోడ్డుపై పడిన తోటపల్లి వెంకటేశ్వర్లను బలంగా ఢీ కొట్టింది. దీంతో వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలై చెవుల ద్వారా రక్తస్రావం తీవ్రంగా అయింది. దీంతో స్థానికులు సమాచారం మేరకు కుటుంబ సభ్యులు హుటాహుటిన ఖమ్మంలోని మమతా జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య లక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పొదిలి వెంకన్న తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఢీకొట్టిన రెండు ద్విచక్ర వాహనాలు పరారైనట్లు స్థానికులు తెలిపారు.

## సర్క్యులర్ రద్దు చేయాలని సిడిపిఓ కు సీఐటీయూ వినతి



**సత్తుపల్లి జూన్ 3(ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 26 న గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందిస్తూ,సేవ చేస్తున్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కు అన్యాయం చేస్తూ ప్రవేశ పెట్టిన సర్క్యులర్ ఆర్.సి నంబర్ 830284(2102) ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సత్తుపల్లి ఐసీడీఎస్ సిడిపిఓ సత్యవతి కు సిఐటియు అనుబంధ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు.ముందుగా ఇటీవల నూతనంగా ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ నుండి బదిలీపై సత్తుపల్లి కు వచ్చిన సిడిపిఓ సత్యవతి కు శాలువ కప్పి గౌరవ సత్కారం చేశారు.2769 ప్రీ ప్రైమరీ కేంద్రాలను, పీ ఎం శ్రీ విద్యను అంగన్వాడీ లకు తక్షణమే అప్పగిస్తున్నట్లు సర్క్యులర్ జారీ చేయాలని,విద్యా బోధన బాధ్యతను అంగన్వాడీలకు అప్పగించాలని,విద్యా వాలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అంగన్వాడీలకు చెల్లించాలని,ఐసీడీఎస్ ను బలోపేతం చేయాలని,పట్టణ ప్రాంతాలలో హెల్పేర్స్ కు టీచర్స్ ప్రమోషన్ ఇవ్వడానికి వార్డు పరిధి అనే పదాన్ని తొలగించి పట్టణ పరిధి అని చేర్చాలని,05 ఏళ్ల లోపు చిన్నారులను ప్రైవేట్,కార్పోరేట్ పాఠశాలలు చేర్పించుకునే వీలు లేకుండా చూడాలని,15 వేల ఖాళీ పోస్టులను ఒకే దఫా లో భర్తీ చేయాలని,ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని,రిటైర్మెంట్ అయిన వారికి ఇవ్వాల్సిన పెండింగ్ సహాయం చెల్లించాలని తదితర సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు వినతి పత్రాన్ని ఇచ్చినట్లు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో: సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్,జిల్లా కమిటి సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు,ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు సుశీల, సకీనా, నాగేంద్ర, జీవమ్మ,రామేశ్వరి,విజయలక్ష్మి,మంగ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి



**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన గుడిపాటి గోపయ్య (75) వడదెబ్బతో అస్వస్థతకు గురై మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు.గోపయ్య మృతదేహాన్ని బుధవారం సీపీఎం నాయకులు తమ్మినేని వెంకట్రావు సందర్శించి నివాళులర్పించారు.మృతునికి భార్య,ఇద్దరు కుమారులు,ఓ కుమార్తె ఉన్నారు.గోపయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో తమ్మినేని ఇంద్రయ్య, యల్లంపల్లి వెంకట్రావు,మడిపల్లి వెంకన్న,పగిడిపల్లి ఉపేందర్,చాట్ల రాము, గుంటి వెంకన్న,రాములు,వెంకట్ తదితరులు ఉన్నారు.

## లండన్ వెళ్తున్న దివ్య కు సిపిఎం నాయకులు అభినందనలు



**బోనకల్, జూన్ 3 (ప్రజా జ్యోతి ):** బోనకల్ మండల పరిధిలోనే గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన కోసూరి శ్రీనివాసరావు, మమత దంపతుల కుమార్తె కోసూరి నవ్య బిటెక్ పూర్తి చేసి బుధవారం రాత్రి ఎమ్మెస్ చదువు కోసం లండన్ వెళుతున్న సందర్భంగా సీపీఐ(ఎం) గ్రామ కమిటీ అభినందనలు తెలిపింది. కోసూరు శ్రీనివాసరావు, మమత దంపతుల అత్యంత నిరుపేద కుటుంబం. అనేక కష్టాలు పడుతూ తన కుమార్తెను ఉన్నత స్థాయిలో చూడాలనే పట్టుదల నేడు ఫలించింది. బీటెక్ పూర్తి చేసిన నవ్య ఉన్నత చదువుల కోసం లండన్ వెళుతుండటంతో ఆ తల్లిదండ్రుల ఆనందం అంతా ఇంతా కాదు. సెంటు భూమి లేకపోయినా కూలీ పనులతో పాటు తన వృత్తి చేసుకుంటూ హైదరాబాదులో కుమార్తెను చదివించాడు. బీటెక్ పూర్తి చసిన అనంతరం కుమార్తెను లండన్ పంపించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను దంపతులు సమకూర్చుకున్నారు. ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్తున్న కోసూరి నవ్య కు సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మాదినేని నారాయణ, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్ర రావు, గ్రామ సర్పంచ్ మంద కరుణ, ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు జొన్నలగడ్డ సునీత, నాయకులు ఏడునూతల లక్ష్మణరావు, కళ్యాణపు శ్రీనివాసరావు, కోసూరు ప్రసాద్, వల్లంకొండ సురేష్, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, తమ్మారపు లక్ష్మణరావు, కోట కాటయ్య అభినందనలు తెలిపారు.

# మధిర కు ఐటీహబ్ మంజూరు చేయడం మధిరకు తలమానికం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు
- సర్వే నంబర్ 43లో ఉన్న 1.16 ఎకరాల కేటాయింపు
- హామీని నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం
- యువత ప్రజలు నుండి వెలువెత్తుతున్న హర్షతిరేకాలు





**మధిర ప్రజా జ్యోతి** మధిర నియోజకవర్గ కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం తో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు కృషి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఐటి హబ్ ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) వైస్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ గతంలో పంపిన నివేదికలు, లేఖలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతరాష్ట్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు కమ్యూనికేషన్ విభాగం ఇచ్చిన నివేదికలకు ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. పట్టణంలోని సర్వే నెంబర్ 46 లో ఐటి టవర్ నిర్మాణానికి గాను అవసరమైన 1.16 ఎకరాల భూమిని ఈ మేరకు గతంలోనే గుర్తించి కేటాయించడం జరిగిన సంగతి తెలిసిందే. ఆంధ్ర సరిహద్దు కాగల తెలంగాణ తొలి పట్టణంగా ఉన్న మధిర కేంద్రంగా ఐటీ హబ్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉపాధి అవకాశాల కల్పనకు సంబంధించి ఉపయోగకరంగా ఉంటుందని డిప్యూటీ సీఎం ఎన్నికల సందర్భంగా తెలపడంతో పాటు ఈ ప్రాంతాన్ని మౌలిక వసతుల కల్పన విద్య ఉపాధి అవకాశాలు కల్పనకు సంబంధించి కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఐటీ టవర్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు లభించడం ద్వారా ఎన్నికల హామీలు నెరవేర్చడంతో టెక్ రంగానికి చెందిన యువత తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యువతకు పెద్ద ఎత్తున పెరగనున్న సాఫ్ట్వేర్ ఉపాది అవకాశాలు మధిర ప్రాంత సాఫ్ట్వేర్ టెక్నాలజీ సంబంధిత విద్యను అభ్యసిస్తున్న యువతకు యువతకు స్థానికంగానే ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి జరగనుంది. ఐటీ హబ్ నిర్మాణానికి సంబంధించి ప్రాథమిక అంచనాలు, సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డి పి ఆర్) త్వరితగతిన సిద్ధం చేయాలని 'టిజిఐఐసి' సంస్థను ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు వ్యయానికి తగిన బడ్జెట్ కేటాయింపులు జరిపేందుకు వీలుగా తక్షణమే నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించింది. కాగా మధిర ప్రాంతానికి ఐటీ టవర్ మంజూరు కావడం పట్ల యువత, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం మధిరను ఐటీ హబ్ గా మార్చేందుకు కృషి చేసిన ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్కకు అన్ని వర్గాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నేత్రదాతలకు ప్రశంసా పత్రము అందజేసి, అభినందించిన మధిర మునిసిపల్ కమిషనర్

**మధిర ప్రజా జ్యోతి** మధిర వాస్తవ్యులు వెచ్చా వీరభద్రరావు , రామకృష్ణల తల్లి సత్యావతి 23/5/2026 న పరమపదించగా వారి నేత్రాలను ఖమ్మం నేత్ర నిధి ద్వారా దానం చేయగా, అట్టి కార్నియాలు అమర్చి ఇరువురు అంధులకు చూపు నొసంగటం జరిగింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం నాడు ఖమ్మం నేత్ర నిధి బాధ్యులు, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవరపు నాగేశ్వరరావు నేత్రదాత కుటుంబ సభ్యులకు, మధిర మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ బెనెడిక్ట్ ఇజ్రాయిల్ పాల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రము మరియు జ్ఞాపిక ను అందజేశారు. నేత్రదానానికి సహకరించిన నేత్రదాత కుటుంబ సభ్యులకు, తమ విలువైన సమయాన్ని కేటాయించి ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రశంసా పత్రం, జ్ఞాపిక తమ చేతుల మీదుగా బహుకరించి నేత్రదాన కార్యక్రమాన్ని ప్రోత్సహించిన కమిషనర్ కి, మాధవరపు నాగేశ్వరావు కృతజ్ఞతలు తెలిపారు.

## డీసీఎం వ్యాన్ ఢీకొని పాడి గేదె మృతి



**బోనకల్, జూన్ 3 (ప్రజాజ్యోతి):** డీసీఎం వ్యాను ఢీకొని పాడి గేదే మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం భారత్ గ్యాస్ కు వెళ్లే సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బోనకల్ మండల కేంద్రానికి చెందిన మరీదు నారాయణ తన గేదెను పొలం నుంచి మేపుకొని వస్తుండగా వైరా వైపు నుండి అతివేగంగా వస్తున్న డీసీఎం వ్యాను ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ సుమారు 1,50,000 ఉంటుందని బాధితుడు నారాయణ తెలిపాడు. చనిపోయిన గేదే నిండు సూడి ఉండటంతో బాధితుడు నారాయణ లబోదిబొమ్మన్నాడు. వెంటనే స్థానికులు లారీని నిలిపి వేసి మృతి చెందిన పాడి గేదె యజమాని మరీదు నారాయణకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## సోసైటీ సిబ్బందిని సన్మానించిన ఏ ఎం సి చైర్మన్ దోమ ఆనంద్ బాబు





**వేంసూరు మే 3 ప్రజాజ్యోతి** వేంసూరు మండలం మర్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మరియు డి సి సి బి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ నందు ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించడానికి కృషి చేసిన వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మరియు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాఘమయి దయానంద్ రైతులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సొసైటీ సిబ్బందికి మరియు గోదాంల ఇన్చార్జ్ రోజా రాణి మరియు సిబ్బంది ని సన్మానించి న ఏఎంసీ చైర్మన్ ఆనంద్ బాబు ఈ కార్యక్రమంలో కందుకూరు సొసైటీ చైర్మన్ గొర్ల సంజీవరెడ్డి మండల పార్టీ అధ్యక్షులు కాస్త్ర చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెల్ది జగన్మోహన్ రావు కరుణాకర్ రెడ్డి వేంసూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఫక్రుద్దీన్ డిసిసిబి బ్యాంక్ మేనేజర్స్ రజిత మర్లపాడు కందుకూరు అడసర్లపాడు మేనేజర్లను సన్మానించడం జరిగింది

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- పంట అవశేషాల కాల్చడం మానుకోవాలి
- చెట్ల పరిరక్షణతో పర్యావరణ సమతుల్యత సాధ్యం
- వేసవిలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి
- ఉపసర్పంచ్ బానోతు కొండ
- మాటా–పాటల ద్వారా అవగాహన కల్పించిన సాంస్కృతిక కళాకారులు




**బోనకల్, జూన్ 3(ప్రజా జ్యోతి):** వ్యవసాయ భూముల సారాన్ని కాపాడుకోవడం, పర్యావరణాన్ని సంరక్షించడం ప్రతి రైతు, ప్రతి పౌరుడి బాధ్యత అని బోనకల్ గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార , పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు బోనకల్ గ్రామంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉపసర్పంచ్ బానోతు కొండ.. పంట కాలం ముగిసిన తర్వాత రైతులు మొక్కజొన్న, వరి తదితర పంటల అవశేషాలను కాల్చివేయడం వల్ల భూమిలో సహజసిద్ధంగా ఉండే సేంద్రియ పోషకాలు నశించి నేల సారం తగ్గిపోతుందని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. పంట అవశేషాలను దహనం చేయకుండా సేంద్రియ ఎరువులుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. అలాగే పొలాల్లో మంటలు వ్యాపించడం వల్ల చెట్లు, పొదలు కాలిపోవడంతో పాటు పక్షులు, చిన్న జీవరాశులు ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ సమతుల్యతకు మూలాధారమైన చెట్లను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. చెట్లు ఆక్సిజన్ను అందించడంతో పాటు వాతావరణ మార్పులను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వేసవి కాలంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, ఉపాధి హామీ పనులు, ఇతర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు తెల్లటి, పలుచని వస్త్రాలు ధరించాలని, సాధ్యమైనంత వరకు ఉదయం వేళల్లోనే ప్రయాణాలు నిర్వహించుకోవాలని కోరారు. తరచూ మంచినీరు తాగ డం, ఎండ తీవ్రత నుంచి రక్షణ పొం దేందుకు తగిన జాగ్రత్తలు పాటించడం అవసరమన్నారు. గ్రామ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ కాపాడాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రమైన వాతా వరణాన్ని నెలకొల్పేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత వల్ల అనేక అంటువ్యాధులను నివారించవచ్చని తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు మాటా–పాటల ద్వారా రైతులకు, గ్రామ ప్రజలకు వ్యవసాయ భూముల పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, వేసవి జాగ్రత్తలు, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కళారూపాల ద్వారా అందించిన సందేశాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి, వ్యవసాయ శాఖ అధికారి బంధం రజిత , గ్రామపంచాయతీ సిబ్బంది ఎస్.కె దస్తగిరి మరియు సంబంధిత అధికారులు. రైతులు, ఉపాధి హామీ కూలీలు, స్థానిక గ్రామస్తులు , కళాకారులు చాపలమడుగు కోటేశ్వరరావు, బీరెల్లి రమణ, మాచర్ల కృష్ణ, బంక భద్రయ్య, బానోత్ రవి, ముత్తయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.